క్లుప్తంగా

నెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలి



వెంకటాయపాలెం రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య(ఫార్మర్ రిజిస్ట్రీ)లో ఈ నెల 31 లోగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏడీఏ ఏఎస్వీ రంగారావు మాట్లాడుతూ పంట యాజమాన్యం గురించి తెలుసుకుని రైతులు తగిన దిగుబడిని, రాబడిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు పి.రేవతి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి

రాయవరం: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించనున్నట్లు రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కన్వీనర్ పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని మాచవరంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకర రాముతో కలిసి ఒకట ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి, రాష్ట్ర ప్రభుత్వం దగ్గర జనాభాకు సంబంధించి తాజా వివరాలు అందుబాటులో లేనప్పటికీ 2011 జనాభా లెక్కలను పరిగణలోనికి తీసుకుని, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం సరికాదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీల్లో అధిక జనాభా ఉన్న మాల సామాజిక వర్గాన్ని తక్కువగా చూపి, మాలలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని అశోక్ కుమార్ హెచ్చరించారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్లడానికి మాలలు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ మండలంలోని వెల్లకు చెందిన గాధంశెట్టి వెంకట సత్యప్రియ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన వివరాలిలా ప్రకారం.. వెంకట సత్యప్రియ సాయి మణికుమార్‌తో 2020లో వివాహం జరిగింది. వివాహ సమయంలో 3 ఎకరాల పొలం, 50 కాసుల బంగారం, అధిక మొత్తంలో లాంఛనాలు ఇచ్చామని, అయినా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లభించని రాజు ఆచూకీ



పరారైన రాజు(ఫైల్)



రాజు ప్రయాణించిన మోటారు సైకిల్

రాయవరం: కుమారుడు, కుమార్తెలను కాలువలోకి నెట్టేసి పరారైన రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గణపతినగరం వద్ద ఇరిగేషన్ కాలువలోకి కుమారుడు రామసందీప్, కుమార్తె కారుణ్యశ్రీలను తండ్రి రాజు కాలువలోకి నెట్టివేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటనలో కారుణ్యశ్రీ మృతి చెందగా, రామసందీప్ బయటపడ్డాడు. అయితే మోటారుసైకిల్‌పై పరారైన రాజు అప్పుల బాధ తాళలేక ఈ ఘోరానికి పాల్పడినట్టుగా భావిస్తున్నారు. అయితే పరారైన రాజు ఏపీ39హెచ్‌కే1660 నంబరు గల మెరూన్ కలర్ సుజుకి యాక్సస్ మోటార్ సైకిల్‌పై పారిపోయినట్లుగా పోలీసులు తెలిపారు. పరారైన సమయంలో రాజు తెలుపు రంగు షర్ట్, నలుపు/నీలం రంగు ఫ్యాంటు వేసుకున్నట్టు తెలిపారు. రాజు ఆచూకీ లభిస్తే రామచంద్రపురం డీఎస్పీ 9440796507, రామచంద్రపురం సీఐ 9440796536, ద్రాక్షారామ ఎస్సై 9440904850 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా దాడులు జరిపి సుమారు 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కే కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై కే అన్నవరం ఆధ్వర్యంలో సిబ్బంది ఆత్రేయపురం మండలం రాజవరం సమీప గోదావరిలో దాడి చేసి సారా తయారీకి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఉంచిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.

నవీకరణకు అవకాశం

- ఆధార్ అప్‌గ్రడేషన్‌కు నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు
- ఆధారాలు చూపితే మార్పులు, చేర్పులు



ఆధార్ నవీకరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు (ఫైల్)

కపిలేశ్వరపురం: వ్యక్తి వివరాలు, సంక్షేమ లబ్ధి, గుర్తింపు తదితర అంశాలన్నింటికీ ప్రామాణికంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఆధార్ జారీ చేస్తోంది. ఈ ప్రక్రియ 2011లోనే ప్రారంభమైనప్పటికీ, తగిన సాంకేతికత అందుబాటులో లేకపోవడం, ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో సన్నద్ధం కాకపోవడం వంటి కారణాలతో ఆధార్ జారీలో పలు సమస్యలు తలెత్తుతూ వస్తున్నాయి. దాదాపు ప్రతి ఒక్కరికీ ఆధార్ జారీ చేసినప్పటికీ, అందులోని వివరాల్లో పొరపాట్లు దొర్లినట్టు ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. దీనికి తోడు సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు ఆధార్ వివరాలు సాంకేతికంగా అడ్డంకిగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు పక్కాగా ఉండేలా నవీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఆ మేరకు నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తోంది.

ఇదీ ఆధార్ నేపథ్యం

కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా 2011లో ఆధార్ కార్డులు జారీ చేసింది. అప్పట్లో నవీకరణ పెద్ద సమస్యగా ఉండేది. పన్నెండేళ్లకోసారి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని అప్పట్లో కేంద్రం స్పష్టం చేసింది. ఆమేరకు 2010–16 మధ్య ఆధార్ పొంది, అప్పటి నుంచీ నవీకరణ చేసుకోని వారి కోసం గతంలో పలుమార్లు ప్రత్యేక శిబిరాలు నిర్వహించింది. ఈసారి శిబిరాల ప్రధాన లక్ష్యం చిన్నారుల బయోమెట్రిక్ వివరాలను నవీకరించడం. ఐదు నుంచి ఏడేళ్ల మధ్య వయస్సు కలిగిన చిన్నారుల వేలిముద్రలను ప్రస్తుత శిబిరాల్లో ఉచితంగా నవీకరించనున్నారు.

ఎందుకంటే..

గతంలో ఆధార్ నమోదు చేసిన్నప్పుడు కొంత మంది వివరాలు తప్పుగా నమోదయ్యాయి. అలాగే, కొంత మంది వేలిముద్రలు పడటం లేదు. ఈ నేపథ్యంలో వేలిముద్రలు, ఐరిస్, ఫొటో, వయస్సు, చిరునామా వంటి వివరాలను నవీకరణ శిబిరాల ద్వారా సరి చేస్తారు. 2023 అక్టోబర్, 2024 ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్ నెలల్లో దశల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ నవీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మరోమారు ఆధార్ నవీకరణ చేసేందుకు గాను బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు.

ఇలా చేస్తారు

- ఆధార్ నవీకరణకు ఈ కార్డులు జారీ చేస్తున్న యూనిక్ ఐడెంటిఫికేషన్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏ) నిబంధనలు రూపొందించింది. దీని ప్రకారం ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారు ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని సందర్శించాలి.
- పుట్టిన తేదీ సరి చేసుకునేందుకు రుజువుగా పదో తరగతి మార్కుల జాబితా లేదా పాస్‌పోర్టు లేదా పాన్‌కార్డును ఆధారంగా చూపాలి. వీటి కాపీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- చిరునామా మార్పునకు బ్యాంక్ ఖాతా, పోస్టాఫీసు ఖాతా, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు అప్‌లోడ్ చేయాలి.
- చిన్నారులకు వారి తల్లిదండ్రుల వేలిముద్రలతో కార్డు జారీ చేస్తారు.
- ఐదేళ్లు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లల వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ చేస్తారు. పిల్లలకు తొలిసారి ఆధార్ ఉచితంగా నమోదు చేస్తారు.

ప్రత్యేక శిబిరాలిలా..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో నేటి నుంచి ఈ నెల 22 వరకూ మూడో వారం, 25 నుంచి 28 వరకూ నాలుగో వారం శిబిరాలను బుధ, గురువారాల్లో పడమర ఖండ్రిక, మాచర, వడ్లమూరు గ్రామాల్లో ప్రారంభిస్తారు. 21, 22 తేదీల్లో తాతపూడి, టేకి–2, కాలేరు సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. 25, 26 తేదీల్లో అద్దంకివారిలంక, వాకతిప్ప, నల్లూరుల్లోను, 27, 28 తేదీల్లో అంగర, కేదారిలంక, నేలటూరుల్లోను శిబిరాలు జరుగుతాయి. ఆయా శిబిరాల్లో కపిలేశ్వరపురం, టేకి–1, వల్లూరు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, అల్లక ఫణీంద్ర నవీకరణ సేవలు అందిస్తారు.

ప్రజల అభిమానం మరువలేం

మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి



చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: గత మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందిస్తూ తనపైన, తోటి కౌన్సిలర్లపైన ప్రజలు చూపించిన అభిమానం మరువలే మని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మండపేట పురపాలక సంఘానికి వైఎస్సార్ సీపీ పాలక వర్గం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆమె నాలుగేళ్ల పాలనను గుర్తు చేసుకున్నారు. తాను చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిందన్నారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు వరకూ సాధారణ గృహిణిగా ఇంటిలో ఉన్న తనకు వైఎస్సార్ సీపీ అవకాశం ఇవ్వడంతో పట్టణ ప్రథమ పౌరురాలుగా సేవ చేసే భాగ్యం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. తనకీ అవకాశం మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ సీనియర్ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య, రెడ్డి రాజబాబుల ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వారికి తన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ నాలుగేళ్ల పాలనలో తాము పట్టణాన్ని రూ.27 కోట్లతో అభివృద్ధి పట్టించామన్నారు. రూ.30లక్షలతో పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. కౌన్సిల్ ద్వారా ఆమోదం తెలిపిన రూ.10 కోట్ల రూపాయల పనులు ప్రారంభించాల్సి ఉందని వివరించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు



మీడియాతో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

మండపేట: ఆధార్ నవీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన షెడ్యూల్ విడుదల చేశారు. బుధవారం నుంచి మొదలుకొని ఈ నెల 28వ తేదీ వరకూ పట్టణంలోని ఆయా సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. నవజాత శిశువులకు బాల ఆధార్ నమోదు, 5 ఏళ్ల నుంచి 15 దాటిన వారం దరూ తమ ఆధార్ కార్డులు తప్పని సరిగా అప్డేట్ చేయించుకోవాలన్నారు. వార్డుల్లోని ప్రజల కోసం ఆయా సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 19, 20 తేదీల్లో పాటిమీద ఎమ్మార్వో కార్యాలయం వద్ద 6 సచివాలయం, న్యూ కాలనీ ప్రకాశం మున్సిపల్ స్కూల్లోని అంగన్ వాడీ సెంటర్, 21, 22 తేదీల్లో గొల్లపుంతలోని కచేరి చావిడి, చిన్నవీధి నూతి వద్ద ఉన్న 9వ సచివాలయంలోను నిర్వహిస్తారు. 25, 26 తేదీల్లో హరిజనపేటలో ఉన్న బాపూజీ స్కూల్, సత్యశ్రీ రోడ్డులో ఉన్న ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ స్కూల్లోను ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 27, 28 తేదీల్లో గొల్లలగుంటలో ఉన్న ఒకటో సచివాలయంలోను, హరిజనపేటలోని బాపూజీ స్కూల్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఆధార్ నవీకరణ చేస్తున్నట్టు కమిషనర్ రంగారావు వెల్లడించారు.

వర్గీకరణకు సిఫారసుకు ఆమోదంపై హర్షం

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై మంత్రుల సంఘం సిఫారసులను ప్రభుత్వం ఆమోదించడంపై కపిలేశ్వరపురం మండల మాదిగ ఐక్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. వర్గీకరణ ఉద్యమ ఫలితంగా తమ సామాజిక వర్గం చిరకాల స్వప్నం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అమలు వైపు పయనించడం సంతోషదాయకమని నాయకులు అన్నారు. ఆ మేరకు సోమవారం రాత్రి పడమర ఖండ్రికలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచుకుని సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పిప్పర సంపతరావు, తాతపూడి రాజేష్‌శర్మ, సతీష్, అబ్రహం, పెందుర్తి తేజ, కందుకూరి రమణమూర్తి, బాబూరావు, మోహనరావు, సురేష్ పాల్గొన్నారు.

కొత్తగా ఎంఎల్ఎస్ పాయింట్

సఖినేటిపల్లి: స్థానిక మార్కెట్ యార్డు గోడౌన్ నుంచి నెలవారీ బియ్యం, ఇతర సరకులు రేషన్ షాపులకు పంపిణీ కోసం కొత్తగా ఎంఎల్ఎస్ పాయింట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై సఖినేటిపల్లి గోడౌన్ నుంచి రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో 110 రేషన్ షాపులకు సరకుల పంపిణీ కానున్నట్టు తెలిపారు.

ప్రజా సంక్షేమంపై పాలకులకు చిత్తశుద్ధి లేదు

కాజులూరు: కమీషన్లు లాభించే రాజదాని నిర్మాణంపై తప్ప ప్రజా సంక్షేమంపై కూటమి నాయకులకు ఏ మాత్రం చిత్తశుద్ధిలేదని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి ఆరోపించారు. గొల్లపాలెంలో మంగళవారం పార్టీ మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నవరత్నాలు పేరుతో నూరుశాతం అమలు చేయడమే కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక కొత్త పథకాలను అమలు చేసి పేదల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కూటమి నేతలు సూపర్‌సిక్స్ హామీలంటూ ఎన్నికల్లో ఊదరగొట్టి అధికారంలోనికి వచ్చాక వాటిని తుంగలోనికి తొక్కారన్నారు. వైఎస్సార్ సీపీ మరాలా అధికారంలోనికి వస్తే తప్ప రాష్ట్రంలో పేదలకు అభివృద్ధి ఫలాలు అందవన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ జొన్నకూటి పద్మజా వెంకటేశ్వరరావు, మండల పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, పోతురాజు బాబురావు, నిమ్మితి విజయ్, చింతా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై ఆందోళన



గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న వీరవెంకటలక్ష్మీ, బీఎస్పీ నాయకులు

కాజులూరు: ఆర్యావటానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మాసాబత్తుల వీర వెంకటలక్ష్మిని అధికారులు విధులలోనికి తీసుకోకపోవటంపై మంగళవారం రాత్రి గొల్లపాలెం పోలీస్టేషన్ ఎదుట బాధితురాలితో కలిసి బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో బాధితురాలు వీరవెంకటలక్ష్మి మాట్లడుతూ గ్రామంలో తాను 2007 నుంచి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక స్థానిక నాయకులు తనని విధుల నుంచి తొలగించి తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకోవాలని చూశారన్నారు. ఈ క్రమంలో తనను తరచూ దూషిస్తూ మానసికంగా ఇబ్బందుల పాలు చేశారన్నారు. తానూ భరిస్తూ విధులు నిర్వహించానని అయినప్పటికీ కుంటిసాకులు చూపించి తనను తొలగించి మరొకరిని నియమించారన్నారు. తాను కోర్టును ఆశ్రయించానన్నారు. కోర్టు ఆదేశాలతో అధికారులు తనను విధులలోనికి తీసుకున్నారని కొన్ని రోజులు పని చేశాకా కూటమి నాయకులు ఒత్తిళ్లతో మళ్లీ తొలగించారన్నారు.

ఈ విషయంపై తాను గొల్లపాలెం పోలీస్టేషన్‌లో ఫిర్యాదులు చేశానన్నారు. అయిన్పటికీ ఎవ్వరూ పట్టించుకోనకపోవటంతో బీఎస్పీ నాయకులను ఆశ్రయించానన్నారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాత సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాధితురాలి వెంట తమ పార్టీ వెన్నంటి ఉంటుందని ఆమెకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లిరాజు, సూరిబాబు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండపేట ఏఎంసీ ఛైర్మన్ల నియామకం



ఛైర్మన్‌గా ఎంపికైన చింతపల్లి రామకృష్ణ



వైస్ ఛైర్మన్‌గా ఎంపికైన మోటుపల్లి బాపిరాజు

మండపేట: నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సమాయత్తమైంది. గత ప్రభుత్వంలో ఏఎంసీ ఛైర్మన్ల పదవీకాలం ఉన్నప్పటికీ కొత్తగా కూటమి అధికార పగ్గాలు చేపట్టడంతో వారు రాజీనామా చేసి ఏఎంసీ నుంచి వెళ్లిపోయారు. ఛైర్మన్లతో పాటు పాలకవర్గంలో సభ్యులు కూడా మూకుమ్మడిగా తమ రాజీనామా పత్రాలను సంబంధిత అధికారికి సమర్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు అవుతున్నా కమిటీ ఎన్నిక జరగక పోవడంతో మండపేట మార్కెట్ కమిటీ అధికారుల చేతుల్లోనే ఉంది. అయితే తాజాగా కొత్త ప్రభుత్వం ఏఎంసీ కమిటీలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేట ఏఎంసీ ఛైర్మన్‌ను ఎంపిక చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి విధేయులుగా ఉన్న వ్యక్తులకు కట్టబెట్టాలనే ఉద్దేశంతో మండలంలోని చిన ద్వారపూడికి చెందిన బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన చింతపల్లి రామకృష్ణను నియమించినట్టు వెల్లడించారు. వైస్ ఛైర్మన్ పదవి కపిలేశ్వరపురం మండలం చిన కోరుమిల్లిలోని కాపు సామాజిక వర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మోటుపల్లి బాపిరాజుకు పేరును ఖరారు చేసినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల తెలిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్యం

కొత్తపేట: వాడపాలెం గ్రామ దేవత మారెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనల్లో భాగంగా సోమవారం రాత్రి చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు కథారూపానికి అనుగుణంగా హావభావాలతో ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారులకు కళలపై, నృత్య ప్రదర్శనపై ఉన్న మక్కువకు ఈ ప్రదర్శన గొప్ప నిదర్శనమని వక్తలు కొనియాడారు. సందర్భంగా చిన్నారులను నాట్యంలో తీర్చిదిద్దిన ఈ నాట్యాచార్యుడు కోలా రామును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. చిన్నరులకు మెమెంటోలు అందజేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కాజులూరు: గొల్లపాలెంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గొల్లపాలెం కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతోంది. కోళ్ళ తూము సెంటర్, కాజులూరు జంక్షన్లలో వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వస్తువులు కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు రోడ్లపైనే తమ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. మరో చోట మార్కెట్ సెంటర్‌లోనే హైస్కూల్, మండల పరిషత్ పాఠశాలలు ఉండడంతో చిన్నారులు బయటకు వచ్చే సందర్భంలో వేగంగా వచ్చు వాహనాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గ్రామంలో మండలానికి చెందిన రక్షణ శాఖ కార్యాలయం ఉన్నప్పటికి తగిన సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావటంలేదని ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన నేషనల్ క్వాలిటీ కమిటీ



నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్స్ కమిటీ వైద్యులతో యూపీహెచ్‌సీ సిబ్బంది

రామచంద్రపురం: పట్టణంలోని కోట హరిజనపేటలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్స్ కమిటీ మంగళవారం తనిఖీ చేసింది. తమిళనాడుకు చెందిన డాక్టర్ వనిత గుజరాత్ నుంచి డాక్టర్ పార్థీవ్ షాలు కమిటీ తరుపున యూపీహెచ్‌లో అందిస్తున్న సేవలను తనిఖీ చేశారు. మెటర్నిటీ హెల్త్, చైల్డ్ హెల్త్, ఫ్యామిలీ ప్లానింగ్, అంటువ్యాధులు, లేబరేటరీ, ఫార్మసీ, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు మొదలగు సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ నిర్వహించడంపై అభినందించారు. జిల్లా కన్సల్టెంట్ సునీత, డాక్టర్ హరీష్, డాక్టర్ హేమ సుధీర్, డాక్టర్ ప్రియాంక, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సూపర్‌వైజర్ ఇందిర, ఓపీ స్టాఫ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ సోషల్ ఆడిట్

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం మండలంలోని 25 పంచాయతీల్లో నిర్వహించిన పనులకు సంబంధించి బుధవారం నుంచి 27వ తేదీ వరకు సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఈ సభల ఫైనల్ పబ్లిక్ హియరింగ్ 28న ఉదయం రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తారు. ఈ విషయాన్ని రామచంద్రపురం మండలం ఏపీఓ మోర్త శ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. 19న ఉదయం చోడవరం, సాయంత్రం బాపనయ్యచెరువు, వెల్లలోను, 20న ఉదయం ఉండూరు, వెంకటాయపాలెం, 21న ఉదయం నరసాపురపుపేట, సాయంత్రం నెలపర్తిపాడు, కందులపాలెం గ్రామ సభలు జరుగుతాయన్నారు. 22న సాయంత్రం తోటపేట, 23న ఉదయం ఓదూరు, వెలంపాలెం, వేగాయమ్మపేట, హసన్‌బాద, సాయంత్రం అన్నాయిపేట, 25న ఉదయం ఆదివారపుపేట, తాళ్లపొలం, భీమక్రోసుపాలెం, సాయంత్రం యనమదల, తాడిపల్లి, 27న మధ్యాహ్నం 2 గంటలకు మాలపాడు, జగన్నాయకులపాలెం, 3 గంటలకు ఉట్రుమిల్లి, ద్రాక్షారామ, 4 గంటలకు ఏరుపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

అసలు హామీలు అమలు చేస్తారా?

- 50 ఏళ్లకే పెన్షన్ అని చెప్పారు
- శాసన మండలిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండలి సమావేశాల్లో ప్రభుత్వ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న తోట త్రిమూర్తులు

మండపేట: కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో బీసీలుగా ఉన్న వారందరికీ 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పారని, ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. శాసన మండలి సమావేశాలు మంగళవారంతో ముగుస్తున్న నేపథ్యంలోను ఆఖరి రోజున కూడా వైఎస్సార్ సీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అనేక ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికల సమయంలో ప్రతి జిల్లాకు వచ్చి బహిరంగ సభల్లో లెక్కలేనన్ని హామీలిచ్చారని ఆ హామీల మాటేంటని వైఎస్సార్ సీపీ తరఫున్న ఎమ్మెల్సీలు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనదైన శైలిలో కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పింఛను పథకం అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఎప్పుడిస్తారో చెప్పాలని కోరారు. ఇదే అంశంపై కౌన్సిల్ సభ్యులు ఒత్తిడి తీసుకురావడం గమనార్హం.

అదుపు తప్పితే అంతే..

- ఏటిగట్టు రహదారికి బెర్మ్‌లు లేక ఇబ్బంది
- ప్రమాద బారిన పడుతున్న వాహనదారులు



బెర్మ్‌లు లేక కోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ఆసుపత్రిపాలవ్వాల్సిందే. పర్యాటకంగా ఆహ్లాదకరంగా ఉండే జొన్నడ–యానం ఏటిగట్టు రహదారికి బెర్మ్‌లు లేక పోవడం ముప్పు ఏర్పడుతోంది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రోడ్డు బాగుండడంతో జొన్నడ–యానం రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో బెర్మ్‌లు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకరంగా ఉంది. కోటిపలి–కోట, బ్రహ్మపూరి– గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకుగురై బెర్మ్‌లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నారు. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్మ్‌లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: ప్రమాదవశాత్తు గాయాలపాలైన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజమహేంద్రవరం అర్బన్ ఏరియాకి చెందిన షేక్ మస్తాన్ ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు విరిగిపోవడంతో మంచాన పడ్డారు. తర్వాత ఇంట్లో పడిపోవడంతో చెయ్యి విరిగింది. ఉన్న ఒక్క కొడుకూ మృతి చెందడంతో ఆయన పనికి వెళ్లలేక పోషించే వారు ఎవరు లేక ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. సేవా సంస్థ సభ్యులు రాజమహేంద్రవరంలోని మస్తాన్ ఇంటికి వెళ్లి రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.